**ఆత్మీయతతో మనసులను గెలుచుకోగలగటమే అసలైన బలం. కేవలం అధికారమే చూపించే వారిపై అవకాశం లభించినప్పుడు అణకువగా ఉండే అమాయకులోనూ తిరుగుబాటుతనం బయటకు వస్తుంది.**

# దాడి

"అయ్యగారూ..."

నడుము వంచి నిలబడిన బండోడు తన స్వరంలో కొంచెం వినయాన్ని పెంచి ప్రాధేయపూర్వకంగా పిలిచాడు. వాడి అసలు పేరు బండి వెంకన్న. మనిషి రివటలా ఉన్నా నలుగురు చేసే పనిని ఒక్కడే చక్కబెట్టెయ్యగలడు! అంత బండచాకిరీ చేస్తాడనే అందరూ 'బండోడా' అని పిలుస్తారు. ఆ పిలుపుకి వెంకన్న అలవాటుపడిపోయాడు. వాడు కూడా ఆ పిలుపుని ఒక బిరుదులా భావించి మురిసిపోతుంటాడు.

కోటలాంటి ఆ ఇంటి వసారాలో సింహాసనం లాంటి కుర్చీలో కూర్చుని ముందున్న ముక్కాలిపీటపై కాళ్ళు బారచాపుకున్న అయ్యగారి అసలు పేరు సింగన్న. ఒక తాతగారి పేరే కాకుండా చిన్నప్పుడే తనలో ఉట్టిపడుతున్న రాజసాన్ని గమనించి తల్లిదండ్రులు తనకు ఆ పేరు పెట్టి ఉంటారని ఆయనకో నమ్మకం!

కొంచెం పెద్దయ్యాక 'సింగన్న' అనే పేరు సింపుల్‌గా ఉండి దర్జాగా లేదనిపించి ఇంకో తాతగారి పేరులోని 'భూపతి'ని కూడా చేర్చుకుని తనపేరును సింగన్నభూపతిగా మార్చేసుకుని సంతృప్తిపడ్డాడు.

ఇంకొంచెం పెద్దయ్యాక, పెత్తనం చేతికి వచ్చాక ఇంటి ప్రహరీగోడపై గేటుకు అటూ ఇటూ సింహాల బొమ్మల్ని పెట్టించి తన పేరుకి తగ్గట్లు తన ఇంటికి కూడా రాచఠీవిని తేగలిగానని సంతోషపడ్డాడు.

తల్లిదండ్రులు వారసత్వంగా ఇచ్చిన నలభై ఎకరాల్నీ తన హయాంలో రెట్టింపు చేయగలిగిన తన సామర్థ్యంపై ఆయనకు చాలా నమ్మకం, గర్వం! అందుకు కఠినవైఖరి అనే తన చేతికర్రే బాగా ఉపయోగిపడిందనేది ఆయన ఉద్దేశం కూడా. ఏ పరిస్థితిలోనైనా సరే దానిని విడవకూడదనేది ఆయన గట్టి అభిప్రాయం.

బండోడివైపు తలతిప్పి నిర్లక్ష్యంగా చూస్తూ "ఊ... ఏంట్రా... " అన్నాడు పెద్దగా సింగన్న భూపతి. పాలేర్లతో మామూలుగా కాకుండా గట్టిగా, పెద్దగా మాట్లాడినప్పుడే తన గొంతు సింహగర్జనలా ఉండి వాళ్ళు భయభక్తులతో ఉంటారనేది ఆయన నమ్మకం!

అయ్యగారి గద్దింపుతో బండోడికాళ్ళలో వణుకు మొదలైంది.

ధైర్యం కూడగట్టుకుని "అయ్యగారూ... నిన్న... పిల్ల పెళ్ళిసంగతి..." అంటూ నసిగాడు.

"నిన్ననే నేనూ చెప్పాగదరా. ఏదీ నేను మరోసారి చెప్పనని తెలుసుగదా ఎదవా".

వాడు చేతులు నులుముకుంటూ ఇంకేదో చెప్పబోయాడుగానీ గేటు తలుపు తీసుకుని వస్తున్న పెద్దమనుషుల్ని చూసి ఆగిపోయి కొంచెం దూరం జరిగాడు.

వెంకన్న తండ్రి వీరన్న. వెంకన్నకి మావగారిచ్చిన మూడెకరాల పొలాన్నీ సాగుచేసుకోవటానికి ఆ ఊరికే మకాం మార్చేశాడు. అయితే క్రమేణా చేసిన అప్పులకి ఆ భూమి చెల్లిపోవటం, తల్లిదండ్రులు అనారోగ్యంతో రెండు మూడేళ్ళ వ్యవధిలోనే కన్నుమూయటంతో, వెంకన్న తిరిగి భార్య, ఇద్దరు చంటి పిల్లలతో సొంతవూరికే చేరుకున్నాడు.

ఆ వూళ్ళో అడుగుపెట్టినరోజే సింగన్నభూపతి గారి దృష్టిలోపడ్డాడు. దూరంగా ఉన్న పాలేర్లను పిలుస్తూ చూసుకోకుండా అడుసుమీద కాలేయటంతో జారి కాలువలో పడిన ఆయన్ని వెంకన్న ఒక్కడే ఈదుకుంటూ వెళ్ళి ఒడ్డుకు లాక్కొచ్చాడు. అప్పుడే సింగన్నగారు వెంకన్న శక్తిసామర్థ్యాల్ని అంచనావేసి తన దగ్గర పనికి కుదిరిపొమ్మన్నాడు. "నీకిద్దరు ఆడపిల్లలు ఉన్నారని తెలుసుగదా, కనిపెట్టి చూస్తాలే..." అని మాట ఇవ్వటంతో వెంకన్న ఇంకేం ఆలోచించలేదు. "కనిపెట్టి చూస్తాలే..." అన్న ఆ ఒక్కమాట వాడిమీద రామబాణంలా పనిచేసింది. సింగన్నభూపతి దగ్గర పాలేరుగా కుదురుకున్న ఇన్నేళ్ళలోనూ ఏ అవసరానికీ ఇంతకావాలని యజమానిని ఎప్పుడూ అడగలేదు వెంకన్న. ఆయన అప్పుడప్పుడూ విదిలించే పదీ, పరకాతోనే సరిపెట్టుకునేవాడు. తన చాకిరీసొమ్మంతా అయ్యగారి దగ్గర కూడబెట్టుకుంటున్నట్లే గదా, పిల్ల పెళ్ళి సమయంలో వాడుకోవచ్చులే అనేకునేవాడు.

వెంకన్న భార్య మంగదీ అదే ఆలోచన. అందుకే వెంకన్నని ఎప్పుడూ డబ్బుకోసం సతాయించకుండా ఒంటిగా తన రెక్కలకష్టంతోనే ఇన్నేళ్ళూ ఇల్లు గడుపుతూ వచ్చింది. ఐదో తరగతితో చదువు ఆపేసిన పెద్దపిల్లని చేతి ఆసరా చేసుకుని, రెండు గేదెల్ని పెట్టుకుని ఆ పాడి డబ్బుతోనూ, అప్పుడప్పుడూ కూలీనాలీ చేసి సంపాదించిన దానితోనూ ఇల్లు గడిపేది. తినీతినకా అన్నట్లుగా రోజుల్ని నెట్టుకొచ్చేది. పిల్లల పెళ్ళిళ్ళప్పుడు తడుముకోవాల్సిన అవసరం లేదనే ధీమా ఇద్దరి గుండెల్లోనూ నిండుగా ఉండేది!

ఆ ఏడు చిన్నపిల్ల పదో తరగతికి వచ్చింది.

పెద్దపిల్లకి సంబంధం కుదిరింది. చుట్టపక్కాలందరూ చేరి పెళ్ళి ఖర్చులన్నీ పిల్లాడి తరఫు వాళ్ళే పెట్టుకునేట్టూ, అందుకుగాను ఒక అంకె నిర్ణయించి ఆ మొత్తం వాళ్ళకి ఇచ్చేయాలని తీర్మానించారు. 'ఆ మొత్తం మా అయ్యగారికి ఓ లెక్కలోది కానేకాదు, కాదనరులే' అనుకున్న వెంకన్న ఆనందంగా అందరి ముందూ సమ్మతించేశాడు.

ఆ ముందురోజు ఆ మాట అయ్యగారి చెవిని వేసిన బండోడికి ఆయన సమాధానం వినగానే గుండెల్లో బండ పడింది!

"ఇన్నేళ్ళూ ముప్పొద్దులా నీకు తిండిపెట్టి, అవసరానికి ఆదుకుంటున్నా. ఇంకా ఏదో దాచిపెట్టినట్టు అడుగుతున్నావేందిరా...! పెళ్ళిరోజున పిల్లచేతిలో ఏదో పెడతాంలే..." అని తేల్చి చెప్పేసరికి వాడికి దిక్కుతోచలేదు.

'అరకొర... తప్పితే ఒక్కసారైన వందనోటు చేతబెట్టిందే లేదు, ఇన్నేళ్ళ చాకిరీ పచ్చడి మెతుకులకే సరి అంటే ఎలా కుదురుతుందీ' అని ఇంట్లో వాళ్ళూ, వీధిలో వాళ్ళు కలిసి వాడికి చివాట్లు పెట్టి అడిగి రమ్మని మళ్ళీ ఆరోజు పంపారు.

'అయ్యగారి ముందు నిలబడి మాట్లాడటనికే తనకి గొంతు పెగలదు, ఇంకా నిలదీయటం కూడానా? వాళ్ళకేం ఎన్నయినా చెబుతారు...' ఇంట్లో వాళ్ళమీద విసుక్కుంటూ మనసులోనే మల్లగుల్లాలు పడుతున్నాడు బండోడు.

ఆ పెద్ద మనుషులిద్దరూ సింగన్నగారి పక్కనున్న కుర్చీలు జరుపుకుని కూర్చుని, వెంట తెచ్చిన నోట్లకట్టలలెక్క ఆయనకు అప్పచెప్పి బ్యాగులో సర్ది ఆయనకందించారు. కాస్సేపు కూర్చుని మాట్లాడి వెళ్ళిపోయారు.

ఆ బ్యాగుని ఒళ్ళో పెట్టుకుని సింగన్నభూపతి అలాగే కూర్చున్నాడు. ప్రస్తుతం ఆయనది కదలలేని పరిస్థితి. పదిహేను రోజులక్రితం, ఆరోగ్యంలో ఏం మార్పు వచ్చిందో గానీ, కాళ్ళు రెండూ వాచిపోయి చచ్చుబడినట్లుగా అయిపోయాయి. ఇద్దరు పాలేర్లు కలిసి ఆయన్ని కుర్చీలో కూర్చోబెట్టడం, మళ్ళీ మంచంమీదకు చేర్చడం జరుగుతోంది. అల్లోపతి, హోమియోపతి అంటూ రకరకాల వైద్యాలు, తైలాల మర్దనలు జరుగుతూనే ఉన్నా పెద్దగా మార్పేమీ కనిపించడం లేదు. కొన్నాళ్ళు వేచి చూడాల్సిందే అని డాక్టర్లు తేల్చేశారు.

బండోడు ఎర్రటి ఎండలో కాళ్ళు చుర్రుమంటున్నా అలాగే నిలబడ్డాడు.

అయ్యగారి కెదురుగా వసారా నీడలోకి జరగటం కూడా వాడికి భయమే మరి!

తన మొర విన్నవించుకుందామని వాడు అనుకునేంతలోనే "సత్తెమ్మా... సత్తెమ్మా..." అన్న అయ్యగారి రంకెలు విని నోరు మూసేసుకున్నాడు. సత్తెమ్మగారి అసలు పేరు సత్యకళ. అన్నేళ్ళ కాపురంలోనూ సింగన్నగారెప్పుడూ భార్యని ఆ పేరుతో పిలిచిందే లేదు!

అమాయకమైన రూపమేకాదు, నిరాడంబరమైన వేషభాషలు, నడవడీ చూసి ఊరివాళ్లందరూ కూడా ఆమెను "నిజంగా ఆవిడ సత్తెకాలపు సత్తెమ్మే" అనుకుంటూ ఉంటారు.

సింగన్నగారి మొదటి భార్య పెళ్ళయిన నాలుగేళ్ళకి ఓ మగపిల్లాడిని కని పురుట్లోనే కన్నుమూసింది. మళ్ళీ ఎన్ని పెళ్ళి ప్రయత్నాలు చేసినా ఏ సంబంధమూ నాలుగేళ్ళదాకా కుదరలేదు. పోతపోసిన ఆరడుగుల కంచు విగ్రహం లాంటి భారీకాయమే కాకుండా, సింగన్నగారి తీరూతెన్నూ తెలిసిన వాళ్ళెవరూ పిల్లనిచ్చే సాహసం చేయలేకపోయారు! తమ స్థాయికి తగ్గ సంబంధం దొరకటం కష్టమేనని అర్థం చేసుకున్న సింగన్న తల్లి, అప్పుల్లో మునిగిపోయిన ఓ పేదరైతు కూతురును తెచ్చి కొడుక్కి పెళ్ళి జరిపించేసింది.

సత్యకళ ఆ ఇంట్లో అడుగు పెట్టాక, సంవత్సరం అయినా గడవకముందే సింగన్న తల్లి బాధ్యత తీరిపోయిందన్నట్లుగా తనువు చాలించి భర్త సరసన చేరిపోయింది.

ఇక అప్పటినుంచీ సింగన్నగారిని అదిలించేవాళ్ళు గానీ, ఏం చేసినా అభ్యంతరం చెప్పేవాళ్ళు గానీ ఇంట్లో లేరు. అందరూ ఆయన కనుసన్నలలో మెలగి తలవొంచి నిలబడేవారే!

కొంచెమైనా ఆస్తిపాస్తులు వెంట తెచ్చుకోని పేదరికమే కాదు, పుట్టింటి వారి అండాదండా, ఆదరణా లేని భార్య సత్యకళ అంటే సింగన్నకు బాగా చులకన. తన ఒంటికీ, ఇంటికీ సేవ చేయటానికి వచ్చిన పరిచారికలాగే భార్య ఆయన కంటికి కనిపిస్తుంది! తనేం చేసినా మాట్లాడకుండా పడివుండటం తప్ప ఆమెకు మరోదారి లేదనే విషయాన్ని పదే పదే గుర్తు చేయడం సింగన్నకు మహా సరదా!

సత్తెమ్మ కూడా భార్య అనే పేరుతో ఆ ఇంట్లో గంపెడు చాకిరీ చేస్తూ కేవలం తలదాచుకోవటానికి తాను ఇక్కడకు వచ్చానన్నట్లుగా కనిపిస్తుంది! భోగభాగ్యాలున్న ఇంట అడుగుపెట్టానన్న ఆనందం, ప్రేమానురాగాలనే మాటలకు తావులేని కాపురం వెలగబెట్టాల్సి వచ్చిందన్న ఆవేదన రెండూ ఆమెలో కనిపించవు! ఎవరైనా పలకరించినప్పుడు నిర్వేదం నిండిన చిరునవ్వుతో నాలుగు మాటలు మాట్లాడటం, రోజంతా ఏదో ఒకపనిలో మునిగిపోవటం... అదే ఆమె అలవాటు.

నాలుగేళ్ళలో కూతురూ, కొడుకూ పుట్టారు. ఆమె ఎప్పుడైనా నోరారా నవ్వి, నాలుగు మాటలు మాట్లాడిందీ అంటే, అదీ సింగన్నగారు ఇంట్లో లేని సమయంలో పిల్లలు ముగ్గురూ ఆవిడ దగ్గరున్నప్పుడు మాత్రమే.

చిన్న చిన్న గళ్ళున్న పసుపురంగు నేతచీర కట్టుకున్న సత్తెమ్మగారు చెంగును కుడిభుజం చుట్టూ కప్పుకుని సింహద్వారం దగ్గరకొచ్చి నిలబడగానే బండోడికో ఆలోచన వచ్చింది.

'పిల్లపెళ్ళి సంగతి అమ్మగారినడిగితేనో...' అనుకోగానే భయంతో మళ్ళీ వాడి ఒళ్ళు జలదరించింది. 'అమ్మో... నయమే... ఆ పని చేయలేదు...' అనుకున్నాడు. వెంటనే ఎప్పటిదో ఒక సంఘటన మనసులో మెదిలింది.

పెరట్లో గుమ్మానికెదురుగా నేలమీద కూర్చుని అన్నం తింటున్న తను ఆఖరి మెతుకులు నోట్లో వేసుకుని వేళ్ళు నాకుతుంటే చూసిన అమ్మగారు ఆదరంగా, "ఇంకొంచెం కావాలేమిట్రా..." అని

అడగ్గానే ఆనందంగా తలూపాడు. అప్పుడే అటుగావచ్చిన అయ్యగారు ఆ మాటవిని "నీ పుట్టింటి నుండి తెచ్చిన ధనరాశులేమైనా ఇక్కడ మూలుగుతున్నాయా దోచిపెట్టడానికి. పెట్టింది చాల్లే..." అంటూ అమ్మగారి చెంప ఛెళ్ళుమనిపించాడు!

నిలువు గుడ్లేసుకుని నిర్ఘాంతపోతూ నిలబడిన అమ్మగారిని చూడగానే తనకి గుండెలో కలుక్కుమంది! తప్పు చేశాననిపించింది. కన్నీళ్ళతో అక్కడ నుండి పారిపోయాడు. అది గుర్తుకు రాగానే మళ్ళీ వాడి కళ్ళు చెమర్చాయి.

కళ్ళు తుడుచుకుంటూ అమ్మగారివైపు చూసిన బండోడు 'ఏటీ... ఈయాల అమ్మగారు కొత్తగా కనిపిస్తన్నారూ...' అనుకుంటూ ఆశ్చర్యపోయాడు. అయ్యగారికి ఎదురుపడాల్సి వచ్చినప్పుడు బిత్తరచూపులు చూసే సత్తెమ్మగారు ఆ రోజు ఆయనవైపు బెదురులేకుండా సూటిగా చూసింది.

"ఇంటికి ఎవరు వచ్చివెళ్ళినా నీకేం తెలియటం లేదు... ఏం రాచకార్యం వెలగబెడుతున్నావ్... కాఫీలు పంపించలేదూ...?" ఛీంకరించాడు సింగన్న.

"వాళ్ళు రావటం, పోవటం చూశానులెండి. ఒకసారికంటే మీకు ఎక్కువసార్లు కాఫీ ఇవ్వొద్దని డాక్టరుగారు చెప్పారు. వాళ్ళతో పాటూ మీకు ఇవ్వాల్సి వస్తుందనీ..."

"డాక్టరు నాకు చెప్పకుండా నీకు చెబుతారా...?" ఉరిమినట్లే ఉంది ఆయన కంఠస్వరం.

"బావుంది...! మంచంపట్టిన మీకు మంచీచెడూ అన్నీ చూడాల్సింది ఎవరూ? నేనేకదూ... నాకు కాకుండా మరి పేషెంట్‌కు చెబుతారా ఏం...! ఎప్పుడుబడితే అప్పుడు... ఏదిబడితే అది మీరడిగినా సరే పెట్టొద్దని ఆచారిగారూ గట్టిగా చెప్పారాయె! పథ్యం కఠినంగా జరగకపోతే గుణం కనిపించదట! పథ్యం గొడవంతా నేనే చూసుకుంటాన్లెండని చెప్పా. ఇంతకీ నన్ను పిలిచింది దీనికోసమేనా... నేను పిండివంట పనిలో ఉన్నా, రేపు అమ్మాయిని అత్తారింటికి పంపిస్తున్నాగా..."

"ఏంటే వాగుతున్నావ్...? కళ్ళు నెత్తికెక్కాయా? అల్లుడు వచ్చి అమ్మాయిని పంపించమని నన్నడిగితేనే కదా ఆలోచిస్తానని చెప్పాను. మధ్యలో నీ బోడి పెత్తనమేంటీ...?"

"అయ్యో రామా! మధ్యలో నన్నంటారేమిటీ... ఇందులో నా పెత్తనమేముందీ...? భార్యాభర్తల మధ్యలో బోలెడు గొడవలుంటాయి. ఒక్కోసారి ఒకరిది పైచేయి అవుతుంది. సర్దుకుపోవాలిగానీ పంతాలకు పోకూడదు కదా! చిన్నపిల్లకదా, తెలియక అలిగి దగ్గరే కదాని పుట్టింటికి పరుగెత్తుకు వచ్చింది. అల్లుడు పట్టూవిడుపూ తెలిసిన మంచివాడు కాబట్టి బెట్టుపోకుండా తానే ఓ మెట్టు దిగొచ్చి రమ్మని పిలుస్తున్నాడు! నాలుగు రోజులు ఉండేసరికి అలకతీరి అమ్మాయీ, బులబాటంగా బయలుదేరతానంటోంది. మధ్యలో మనం కలుగజేసుకోవటమెందుకూ? మిమ్మల్ని అమ్మాయి ఓ మారు అడుగుతానంటే నేనే అవసరం లేదన్నాను. మీరు ఒకమాటమీదే ఉంటారుగానీ... మరోసారైనా ఇంకోమాట చెప్పరని నాకూ తెలుసు గదా... అందుకే నేనే 'మీ ఇంటికి వెళ్ళటానికి ఎవరి అనుమతి అక్కర్లేదు' అని అమ్మాయికి చెప్పాను...".

గుక్క తిప్పుకోవటానికన్నట్లుగా ఒక క్షణం ఆగి మళ్ళీ మొదలుపెట్టింది.

"చిన్నబ్బాయిని ఇక చదువు చాలించి మీకు చేతిసాయంగా ఇక్కడే ఉండిపొమ్మని చెప్పారా, ఈ రోజుల్లో చదువులకోసం అమెరికా అయినా వెళ్ళటానికి వెనకాడటం లేదాయె, అలాంటిది వీడిని ఇంటరుతోనే ఆపేయమనటం ఏం బాగూ? ఇంకోమాట మీరు చెప్పలేరని తెలిసి మళ్ళీ మిమ్మల్ని అడగటమెందుకూ అని... నేనే 'శుభ్రంగా వెళ్ళి నాలుగేళ్ళూ చదువుకునిరా, ఆ తర్వాతే వ్యవసాయమా, వ్యాపారమా, ఉద్యోగమా అని ఆలోచించుకోవచ్చు' అని అబ్బాయికి చెప్పేశాలెండి.

మంచం పట్టిన మీకు అన్నీ మేమే చేయాలి తప్ప మీరేం చేసుకోలేరనే మాటా నిజమే కదా! ఇన్నేళ్ళూ ఒక్కరే ఇంటి భారం మోసిన మాటా నిజమే...! మీరిప్పుడు విశ్రాంతిగా, ప్రశాంతంగా ఉండాలని డాక్టర్లు చెప్పిన మాటా పాటించాల్సిందే కదా, తప్పదు! అందుకే అబ్బాయి వెళ్ళేలోగా ఈ నాలుగురోజుల్లో కౌలు లెక్కలూ, డబ్బు లావాదేవీలు చూసుకోవటమూ అన్నీ నేనే తెలుసుకుంటా! నేర్చుకుంటే రానిదంటూ ఏదీ ఉండదు! లేచి తిరగలేకపోయినా మాట సాయానికి మీరెలాగూ ఉండనే ఉంటారుగా...".

సింగన్నగారి ఆశ్చర్యానికి అంతేలేదు! విభ్రాంతిగా కళ్లింతచేసుకుని చూస్తున్న ఆయన కొంచెం తేరుకుని 'సత్తెమ్మా...' అని గట్టిగా అరవాలనుకున్నాడు. కానీ, బిగుసుకుపోయినట్టుగా, ఆయన గొంతు పెగలనే లేదు! చిన్న మూలుగులా "స...త్యా..." అనే మాట మాత్రమే బయటకు వచ్చింది.

ఆవిడ మాటల ప్రవాహం మళ్ళీ కొనసాగింది. "చూశారా... ఈ మాట చెప్పటం మరచిపోయాను. పెద్దబ్బాయి ఫోను చేసి, తన దగ్గర పది రోజులుండి బెంగుళూరు చూడటానికట నన్ను రమ్మన్నాడు. 'కాళ్ళు రెండూ లేనట్లుగా మంచం మీదే ఉంటున్న మీ నాన్నకిప్పుడు చేతి ఆసరా నేనే గదా, ఎలా వస్తానని అనుకున్నావురా' అనడిగాలెండి. 'ఊళ్ళు తిరిగి చూడాలనే సరదా ఏం లేదుగానీ, చదువు పూర్తి చేసి మనూళ్ళో హాస్పిటల్ పెట్టి మీ నాన్నకి బరువు లేకుండా ఇంటి పెత్తనమంతా నువ్వు తీసుకుంటే అది చాలూ అని చెప్పా. 'నీ మాట నేనెప్పుడూ కాదననమ్మా...' అన్నాడు. ఆ ఒక్క మాటకీ అబ్బో... నాకెంత ఆనందమేసిందో...! ఆస్తులుంటేనేం, పోతేనేం, పిల్లలు పద్ధతిగా పెరిగి బుద్ధిమంతులయ్యారు. మనకదిచాలు!

ఇంకో విడ్డూరం విన్నారా... తమ్ముళ్ళిద్దరూ బాగా చదువుకుని పెద్ద ఉద్యోగాల్లోనే చేరారుగా, అప్పులన్నీ తీరి... వాళ్ళ పరిస్థితి బాగుపడినట్లుంది. మొన్న తమ్ముడు ఫోను చేసి 'ఇన్నాళ్ళూ పరిస్థితుల్ని బట్టి నిన్ను పిలవలేకపోయాం. ఇప్పుడైనా వచ్చి పదిరోజులుండి పసుపూ కుంకుమా తీసుకెళ్ళక్కా... నీకూ మాకూ మంచిదీ...' అంటున్నాడు! మా నాన్న కూడా 'నీ పేర ఎంతో కొంత భూమి రాస్తానమ్మా' అన్నాడు. అయినవాళ్ళ ఆసరా ఉందనిపించటమే బలం, రాకపోకలే ఆనందం... అంతకుమించి నాకేం అక్కర్లేదని చెప్పేశాలెండి. మనకున్నది చాలదా, ఇంకా పోగేసుకుని ఏం చేసుకుంటాం. పోయేటప్పుడు పట్టుకుపోలేం గదా..." అంటూ చిన్నగా నిట్టూర్చింది.

సింగన్నగారు రెప్పవేయటం కూడా మర్చిపోయినట్లుగా ఆమెను అలాగే చూస్తూండి పోయారు. సత్తెమ్మ ఏమిటీ... ఇలా కొత్త అవతారం ఎత్తిందేమిటీ...?! బెరుకు చూపులే తప్ప మాటలే రానట్లుండే అమాయకురాలు. ఈ రోజు ఝుణఝుణమంటూ మాటల్నిలా చెరిగేస్తోందీ....!

అదను దొరికేసరికి మాటలకీ పదును పెరిగిపోతుందా? కాళ్ళు లేని తనకి తన చేతి ఆసరా తప్ప మరోదారి లేదని తెలివిగా తెలియజెబుతోందా...? ఇప్పుడు తనకీ పుట్టింటి ఆసరా ఏర్పడిందనీ, పిల్లల అండా తనకేనని ఆధిపత్యం చూపిస్తోందా...?

మాటలతోనే మెత్తని వాతలు పెట్టేటంత చాతుర్యం ఇన్నాళ్ళూ కనబడకుండా, ఉండి, అవకాశం దొరకగానే పైకి తన్నుకు వచ్చేసిందా...? ఏం మాయ జరిగింది...?'

బోనులో ఉన్న సింహంపై చిట్టెలుక దాడిచేసి... గెలుపు తనదేనని తోక ఎగరేసి చెప్పినట్లుగా సత్తెమ్మ ప్రవర్తన ఉందని ఆయన కనిపించింది.

ఏం అనాలో, ఏం చెయ్యాలో తోచనట్లుగా చూస్తున్న సింగన్నగారి దగ్గరకు వచ్చి "ఇచ్చిపుచ్చుకోవటాలన్నీ చేయాల్సింది నేనేగా, మీ దిండుక్రింది తాళాలు తీసుకున్నాను. ఆ బ్యాగు ఇటివ్వండి, బీరువాలో పెడతాను..." అంటూ చొరవగా ఆవిడ తన చేతిలోకి తీసుకుంది.

నిర్ఘాంతపోతూ అమ్మగారి మాటలు వింటున్న బండోడిలో అప్పటికి చలనం వచ్చింది. గాలి విసురుకు నివురు ఎగిరిపోగా రాజుకున్న నిప్పుకణికలా ఉన్న అమ్మగారిని అబ్బురంగా చూశాడు.

వాడిలోనూ ఏదో మెరుపు మెరిసి, ఒకదారి కనిపించినట్లయింది! ఎండలో నిలబడినవాడు నీడలోకి జరిగి నిటారుగా నిలబడ్డాడు. అయ్యగారివైపు బెరుకు లేకుండా ధీమాగా చూశాడు. చేతులు కట్టుకుని వినయంగానే అన్నాడు.

"అయ్యగారూ, మీది అదే మాటయితే... నేనూ ఈ చాకిరీ వదిలి పట్నం పోతానండీ, మా బావమరిది బంధువొకడు పట్నంల కలక్టరమ్మ దగ్గిర కొలువులో పనిచేస్తన్నాడు. వాడి భూమిని ఎవురో దాయాదులు కాజేస్తే ఆ కలక్టరమ్మగారే ఆ కాయితాలు తీయించి కేసు పెట్టించి ఆడికి నాయం జరిగేట్టు చూశారంట! పేదోళ్ళంటే దయగా సూస్తారని వాడే చెప్పి ఆరి బంగళాలోనే మొక్క, మోడు సూసే పనుందీ, చేస్తవా అనడిగాడులెండి. ఇక అక్కడికే పోదామనుకుంటున్నానండీ...."

సత్తెమ్మగారి మాటల షాక్ కంటే, బండోడి మాటలతో ఇంకా పెద్ద షాక్ తగిలింది సింగన్నగారికి. మూకుమ్మడి దాడి జరిగినట్లుగా ఉక్కిరిబిక్కిరి అయిపోయారు.

గడప దగ్గరకు వెళ్ళిన అమ్మగారు బండోడి మాటలు విని వెనక్కిచూసి ఒక అడుగు ముందుకు వచ్చింది. "బండచాకిరీ చేస్తావేగానీ నీకు బుర్ర తక్కువని అందరూ అనేమాట నిజమేనన్నమాట! అయ్యగారు ఇంకో మాట చెప్పనంటే అంతేనా. నేను లేనా..? నీ కష్టం సొమ్ము రొక్కించి అడిగి తీసుకోవాలిగానీ ఊరొదిలి పోతానంటే... పిల్లకి పెళ్ళయిపోతుందా...? నీ రెక్కల కష్టాన్ని కలిపేసుకునేంత కానివాళ్ళమేం కాదు! అయ్యగార్ని కాచుకుని చూసుకునే రోజుల్లో పనొదిలి పోతాననటం తప్పుకాదూ...? రేపు గుమాస్తాగారున్నప్పుడు వచ్చి... ఆ లెక్కా డొక్కా చూసుకుని నీకు రావాల్సింది పట్టుకుపో. నేనూ చూస్తాలే... ఇంకోమాట! చిన్నదాని పెళ్ళి కూడా మళ్ళీ తొందర్లోనే తలపెట్టావంటే నేనూరుకోను మరి! ఇప్పుడే గట్టిగా చెబుతున్నాను. తను ఏం చదువుతానన్నా చదివించే పూచీ నాది! నీకేం పేచీ లేదులే...! తెలిసిందా? ఈ రోజుల్లో ఎవరికైనా చదువుంటేనే అన్యాయం చేసినా ఎదురుతిరిగి అడిగే

బలం వస్తుంది – ఇకపో...” అంటూనే “ఇంకోమాట కూడా చెబుతాను... విను” అని మళ్ళీ మొదలుపెట్టింది.

“అయ్యగారికిప్పుడు విశ్రాంతి అవసరం. మీరెవరూ ఇలాంటి ఇరకాటాల్ని అయ్యగారి ముందుకు తెచ్చిపెట్టకండి. ఏదైనా నాకే చెప్పండి. పెద్దబ్బాయి వచ్చేవరకూ నాకు తప్పదు మరి...!”

చివాట్లేస్తున్నట్లుగానే వరాలు కురిపించిన అమ్మగారివైపు బండోడు భక్తికి మించిన భావంతో చూసి చేతులు జోడించాడు.

చిత్తయిపోయినట్లుగా ఉన్న అయ్యగారివైపు చూస్తుంటే వాడికి నవ్వు ఎగదన్నుకు వచ్చిందిగానీ నొక్కి పెట్టాడు. ‘సింగన్న భూపతి దొరా ఎంతపని జరిగిందీ’ అనుకున్నాడు. ఇంటికి పోవటానికి అటు తిరిగి అడుగేయగానే, బిగబట్టిన నవ్వును హాయిగా వదిలేశాడు.

అధికారికంగానో, ఆర్థికంగానో, శారీరకంగానో ‘బలవంతుడ నాకేమని...’ అనుకుంటే, కష్ట సమయంలో ఒక్కోసారి బడుగుజీవుల దాడినే ఎదుర్కోవలసిరావచ్చు. నలుగురు ఆత్మీయులను సంపాదించుకోగలగటమే అసలైన బలమని అప్పుడు తెలిసి వస్తుంది.

❋ ❋ ❋

**‘నవ్య వీక్లీ’ 24-4-2019**